క్లుప్తంగా

బేతంచెర్ల ఎంఈఓ-2 బాధ్యతలు



బాధ్యతలు తీసుకుంటున్న అబ్రహం

బేతంచెర్ల: పట్టణంలోని ధరణి టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అబ్రహం ఎంఈఓ-2గా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. సూపరింటెండెంట్ దస్తగిరి బాబు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ తోపాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి అబ్దుల్ హక్

అవుకు: మండల పరిధిలోని ఎరువుల దుకాణ యజమానులు యూరియాను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. రైతులు ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఫిబ్రవరి 25వ తేదీలోపు ఈ క్రాప్‌తో పాటు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని తన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శుక్రవారం రాజ్ న్యూస్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, రాజ్ న్యూస్ ప్రతినిధి వెణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



అమ్మవారు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. సహస్ర దీపాలంకరణ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు రంగస్వామి తల్లి కర్ణమ్మ (88) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి కర్ణమ్మ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మౌలాలి స్వామి ఉరుసు



మౌలాలిస్వామి పీరు

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో మౌలాలి స్వామి ఉరుసును గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మూడు రోజుల పాటు సాగే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉరుసు నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలాలి స్వామి దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామికి ఫాతెహాలు సమర్పించారు. శనివారం తెల్లవారుజామున స్వామి వారికి గుర్రంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

బాలికలకు బంగారు భవితనిద్దాం

• ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



బనగానపల్లె: విద్యార్థినులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, ఎస్ఐ



అవుకు: మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు

బనగానపల్లె రూరల్: బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా వారిని ప్రోత్సహిద్దామని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, అధికారులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రభుత్వ వైద్యశాల మీదుగా పెట్రోల్‌బంకు కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మగ పిల్లలతో సమానంగా బాలికలను పెంచాలని, వివక్ష చూపించరాదన్నారు. ప్రస్తుతం బాలికలే అన్నీ రంగాల్లో సత్తాచాటుతున్నారని తెలిపారు. చిన్న వయసులోనే వివాహాలు చేసి వారి జీవితాలను నశనం చేయవద్దని కోరారు. ఎస్ఐ దుగ్గిరెడ్డి మాట్లాడుతూ.. బాలికా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు సాలమ్మ, శైలజ, చిట్టెమ్మ, వెలుగు ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పసుపల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు రంగనాథ్, ఖాజావలి, తిరుపాల్, అంగన్‌వాడీ కార్యకర్త రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.

బాలిక విద్యతోనే సమాజ అభివృద్ధి

డోన్ టౌన్: బాలిక విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మమత అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలోఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలికల సంరక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని.. వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని.. ఆపద సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యతోనే పిల్లలకు భవిష్యత్తు ఉంటుందనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలు చేసి వారి జీవితాన్ని నాశనం చేయవద్దన్నారు. బాలబాలికలను సమానంగా చూస్తేనే వారిలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, ఉపాధ్యాయులు అరుణ కుమారి, అనురాధ పాల్గొన్నారు. అలాగే స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి బాలికలు, మహిళా హక్కులు, చట్టాలు గురించి వివరించారు. ఉపాధ్యాయులు రమాదేవి, సుజాత, ప్రజ్వల, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను చదివించాలి

కోవెలకుంట్ల: మగ పిల్లలతోపాటు ఆడపిల్లల చదువును ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ సూచించారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నేటి సమాజంలో పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. బాల్యవివాహాలతో అనేక అనర్థాలు తలెత్తుతాయని పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, మల్లిక, జయమ్మ, మంజుల, రంగమ్మ, బ్రహ్మావతి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

అవుకు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పావని, శివమ్మ అన్నారు. అవుకు బాలికల పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు.

• **సంజామల:** స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ శాంత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ సాల్మన్, ఎస్ఐ రమణయ్య, సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, పేరుసోముల ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సుగుణ, రసూల్‌బి తదితరులు పాల్గొన్నారు.



కోవెలకుంట్ల: అవగాహన ర్యాలీ



డోన్: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ మమత



సంజామల: మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్



డోన్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో..

సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్

బేతంచెర్ల: నిరుద్యోగ యువతీయువకులు పీఎం ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ గోపినాథ్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బందితో కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఇందులో చేరే నిరుద్యోగులకు వన్‌టైం గ్రాంట్ కింద రూ.6 వేలు, ప్రతి నెలా స్టైఫండ్ రూ. 5 వేలు ఇస్తారన్నారు. 21 నుంచి 24 ఏళ్లలోపు విద్యార్థులు internship. mca.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు అనర్హులన్నారు. ఏడాదికి రూ.8లక్షలకు మించి ఆదాయం ఉండకూడదని పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

కొలిమిగుండ్ల: నిరుద్యోగ యువతీ, యువకులు పీఎం ఇంటర్న్‌షిప్ ద్వారా జీవనోపాధి అవకాశాలు పెంపొందించుకోవచ్చని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి శుక్రవారం తెలిపారు. ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసుకున్న వారితో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ అభ్యసిస్తున్న విద్యార్థులు పీఎం ఇంటర్న్‌షిప్‌కు పేర్లను నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు. 21 నుంచి 24 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈనెల 26లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి శిక్షణతో పాటు స్టైఫండ్ అందిస్తారని చెప్పారు.

పశుసంపద.. మన సంపద



కమలాపురంలో మేకలకు నట్టల నివారణ ద్రావణాన్ని తాపిస్తున్న ఏడీఏ



సోదరదిన్నెలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

డోన్: ఉచిత పశువైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్య సంయుక్త సంచాలకుడు డాక్టర్ నాగరాజు అన్నారు. డోన్ మండలం కమలాపురం గ్రామంలో డాక్టర్ హరీష్, వెటర్నరీ అసిస్టెంట్‌లు జీవిత, మహమ్మద్ రఫీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పశువులు, దూడలు, గొర్రెలు, మేకలు, ఎద్దులకు నట్టల వ్యాధి నివారణ కోసం ద్రావణాన్ని తాపించాలని పశుపోషకులకు సూచించారు. పశుపోషకుల అభ్యున్నతి కోసం గోకులం పథకం, పశుగ్రాస క్షేత్రాలు రాయితీపై కల్పిస్తున్నట్లు తెలిపారు.

పశువులకు వైద్య పరీక్షలు

కోవెలకుంట్ల: మండలంలోని సోదరదిన్నె, చిన్నకొప్పెర్ల గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 1,203 పశువులు, జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పశువైద్యాధికారులు కృష్ణకుమార్, విజయలక్ష్మి తెలిపారు. ఆయా వైద్య శిబిరాల్లో 181పశువులకు సాధారణ వైద్య పరీక్షలు, 24 చూడి పరీక్షలు, 22 గర్భకోశ వ్యాధులు, 710 దూడలు, బర్రెలు, ఎద్దులు, జీవాలకు నట్టల నివారణ మందులు, 257 పశువులకు బొబ్బవ్యాధి టీకాలు, తొమ్మిది ఎద సూదులు వేసినట్లు పేర్కొన్నారు. అనంతరం పాడి రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు శైలజ

యాడికి: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా అవుకు మండలం కోనాపురం గ్రామానికి చెందిన చుక్కల నాగిరెడ్డి, శైలజ(39) దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యాడికి మండలం గుడిపాడు వద్ద ఉన్న ఓ సిమెంట్ కర్మాగారంలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగిరెడ్డి గత 12 ఏళ్లుగా ఇక్కడే క్వార్టర్స్‌లో కుటుంబసభ్యులతో కలసి నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్లిన ఆయన సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లో ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి విగతజీవిగా కనిపించిన భార్య శైలజను గమనించి చుట్టుపక్కల వారి సాయంతో హుటాహుటిన తాడిపత్రిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ఆమె ఆత్మహత్యకు కారణం తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించి మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

• కాశీ విశ్వనాథస్వామి ప్రతిష్టోత్సవాలు





నూతనంగా నిర్మించిన కాశీవిశ్వనాథస్వామి గాలిగోపురం, నాగప్రతిష్టకు ఏర్పాటు చేసిన మండపం

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీసెంటర్‌లో నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఈ నెల 31వ తేదీ నుంచి మూడు రోజులపాటు నాగప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో మొదటి రోజు గంగాయనం, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, పంచగవ్యమేళన, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, వచ్చే నెల 1వ తేదీ రుద్రాభిషేకం, మహాస్నపనం, గణపతి, నవగ్రహ, రుద్ర, దేవి పంచసూక్త లక్ష్మీనారాయణ, సుదర్శన, తదితర హోమాలు జరుగుతాయన్నారు. 2వ తేదీ యంత్రప్రతిష్ట, ధ్వజ, శిఖర కలశ, విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్న నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేసి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆత్మహత్యలకు ఈ విద్యా సంస్థలు కారణం అవుతున్నాయని ఆరోపించారు. విద్యార్థులను చిత్రహింసలకు గురిచేస్తున్నారన్నారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శులు అక్బర్‌బాషా, రాజేష్, మహేష్ ఉన్నారు.

26న మాంసం విక్రయాలు బంద్

బేతంచెర్ల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీ బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో మాంసం విక్రయాలను నిషేధించినట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ శుక్రవారం తెలిపారు. చికెన్, మటన్ దుకాణాల్లో మాంసం అమ్మినా, హోటళ్లలో నాన్ వెజ్ భోజనం చేసినా జరిమానాతో పాటు 1965 యాక్ట్ ప్రకారం క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

28న జాబ్‌మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 28వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డోన్ స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ పుల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో బ్రయిట్ టెక్ ఇండస్ట్రియల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బి న్యూ మొబైల్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూచర్ ప్రాపర్టీ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాతో హాజరుకావాలని, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

బేతంచెర్ల: కుటుంబ సమస్యలతో యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన బేతంచెర్ల తహశీల్‌పేట కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన యువకుడు శుక్రవారం పేడ రంగు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు.

రేపు గోర్లగుట్టలో వైద్య శిబిరం

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా మర్మకళ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యుడు సుబ్రమణ్యఆచారి తెలిపారు. గ్రామస్తుడు నాగ బ్రహ్మయ్య ఆచారి సహకారంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరుగుతుందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కర్పూరి ఠాకూర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయీబ్రాహ్మణులు

డోన్: బిహార్ దివంగత మాజీ ముఖ్యమంత్రి జననాయక్ కర్పూరి ఠాకూర్ జయంతిని పట్టణంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు శుక్రవారం నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వెనుకబడిన వర్గాలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. సంఘం గౌరవ సలహాదారులు కలచట్ల చంద్రశేఖర్, ఏపీ చేతివృత్తుల జిల్లా కార్యదర్శి రామ్మోహన్, నాయకులు రామక్రిష్ణ, రమేష్, సురేష్, శంకర్, అశోక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో డోన్ విద్యార్థి ప్రతిభ

డోన్ టౌన్: వివిధ పోటీల్లో పాల్గొన్నప్పుడే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్రుడు అన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో నంద్యాల్లో జరిగిన బాలోత్సవంలో జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి సాధించిన బి.రాముడు అనే విద్యార్థిని స్థానిక కొత్తపేట జెడ్పీ స్కూల్‌లో శుక్రవారం సత్కరించి అభినందనలు తెలిపారు. రాముడు మట్టితో చేసిన వివిధ రకాల కూరగాయలు జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ఉపాధ్యాయులు మాణిక్యంశెట్టి, లోక్‌నాథ్‌రెడ్డి, సుధాకర్, నూర్జహాన్, రాఘవేంద్రమ్మ, సువర్ణ, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



బనగానపల్లెలో అవగాహన ర్యాలీలో పోలీసులు



హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ప్యాపిలి: ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐలు మధుసూదన్, లక్ష్మణరావు, నాగార్జున అన్నారు. శుక్రవారం పోలీసులు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు తలకు బలమైన గాయాలు కాకుండా హెల్మెట్ రక్షణగా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేని కారణంగా తలకు తీవ్ర గాయాలు కావడంతో మరణించిన వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందన్నారు. కుటుంబ సభ్యులు తమపై ఆధారపడ్డారన్న విషయాన్ని వాహన చోదకులు అనుక్షణం గుర్తుంచుకోవాలన్నారు.

బనగానపల్లె: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామంలో శుక్రవారం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

ప్రాణ రక్షణకు హెల్మెట్ ధరించాలి



రామాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ



వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న సీఐ

అవుకు: ద్విచక్ర వాహనాలు నడిపే వారి ప్రాణ రక్షణకు తప్పకుండా హెల్మెట్ ధరించాలని బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి అన్నారు. అవుకు మండల పరిధిలోని రామాపురం, చెర్లోపల్లె గ్రామాల్లో యువతతో కలిసి హెల్మెట్ ధరించి శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. చిన్నపాటి సంతోషాల కోసం ప్రాణాలను బలి చేసుకోవద్దని సీఐ అన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చేయొద్దని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజారెడ్డి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

సంజామల: ప్రతి వాహనదారుడు బైక్ నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోవెలకుంట్ల సీఐ హనుమంత్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో శుక్రవారం వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వాహనం నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. రోడ్డు నియమాలు పాటించాలన్నారు. అనంతరం దాతల సహకారంతో హెల్మెట్లు పంపిణీ చేశారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఎంవీఐ ప్రదీప్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లు డ్రైవింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని నంద్యాల మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్స్(ఎంవీఐ) ప్రదీప్‌రెడ్డి, తిమరుసు నాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూ పాఠశాలలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అతి వేగం ప్రమాదకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు వాహనం ఎక్కి, దిగే సమయాల్లో పిల్లలు దిగిన తరువాత చూసుకుని వాహనం ముందుకు వెళ్లాలన్నారు. సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు మత్తు పదార్థాలు తీసుకోరాదని, లైసెన్స్, బీమా తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. డాక్టర్ ఉమాదేవి బస్సు, ఆటో డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

• ఇదేం నిర్వాకం..!



పార్కు వద్ద కంప చెట్లలో పడేసిన బారికేడ్లు



నెహ్రూ నగర్‌లో వృథాగా ఉన్న బారికేడ్లు

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం దాతలు విరాళంగా అందజేసిన బారికేడ్లు ఎవరి అవసరానికి వారు ఎత్తుకెళ్తున్నారు. ఫలితంగా ప్రధాన కూడళ్లలో బారికేడ్లు కనుమరుగవుతున్నాయి. ఇటీవల సంక్రాంతి ముగ్గుల పోటీల సందర్భంగా కొందరు ఆయా ప్రధాన రహదారుల్లో పోటీలు నిర్వహించేందుకు బారికేడ్లను కూడళ్ల నుంచి ఎత్తుకెళ్లారు. అయితే వాటిని తిరిగి ట్రాఫిక్ కూడళ్లకు చేర్చే బాధ్యతను నిర్వాహకులు విస్మరించడంతో పాత ఇనుప సామాను వ్యాపారులు వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని బారికేడ్లను స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. –డోన్